తప్పిపోయిన బాలుడు తల్లిదండ్రుల చెంతకు



బాలుడిని అప్పగిస్తున్న పోలీసులు

మోతీనగర్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): తప్పిపోయిన మూడేళ్ల బాలుడిని గంట వ్యవధిలో పోలీసులు క్షేమంగా తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. కొండాపూర్‌కు చెందిన జె.మహేష్ కుమారుడు హరీష్వా(3) శనివారం మధ్యాహ్నం 1 గంట సమయంలో ఇంటి ఎదుట ఆడుకుంటూ తప్పిపోయాడు. కొంతసేపటికి బాలుడు కొండాపూర్‌లోని వైట్ ఫీల్డ్ రోడ్డులో అయోమయంగా తిరుగుతూ ఉండగా అటుగా వస్తున్న రాజశేఖర్ అనే వ్యక్తి గుర్తించి బాలుడితో మాట్లాడగా తాను తప్పిపోయానని బాలుడు ఏడ్చుకుంటూ చెప్పాడు. రాజశేఖర్ మాదాపూర్ డీసీపీ కార్యాలయంలో అప్పగించాడు. దీంతో డీసీపీ డాక్టర్ జి వినీత్ ఆదేశాల ప్రకారం మాదాపూర్ సీఐ గడ్డం మల్లేష్ గంట వ్యవధిలో తప్పిపోయిన బాలుడి తల్లిదండ్రులను గుర్తించి డీసీపీ సమక్షంలో బాలుడిని తండ్రికి అప్పగించారు. బాలుడు విషయంలో బాధ్యతగా వ్యవహరించిన రాజశేఖర్‌ని డీసీపీ ప్రత్యేకంగా అభినందించారు.

ఆటోను ఢీకొని కానిస్టేబుల్‌కు తీవ్ర గాయాలు

ఖైరతాబాద్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): రోజువారి విధులకు హాజరయ్యేందుకు బైక్‌పై వెళ్తున్న కానిస్టేబుల్ ఆగి ఉన్న ఆటోను ఢీకొట్టాడు. ఈ సంఘటనలో కానిస్టేబుల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సైఫాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తెలుగుతల్లి ఫ్లైఓవర్ పై శనివారం రాత్రి ఈ ఘటన జరిగింది. ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర తెలిపిన వివరాల ప్రకారం... కమిషనరేట్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ ఉపేందర్.. మధ్యాహ్నం తన ద్విచక్రవాహనంపై డ్యూటీకి వెళ్తుండగా తెలుగుతల్లి ఫ్లైఓవర్ పై.. ఆయనకు ముందున్న ఆటో ఒక్కసారిగా ఆగిపోవడంతో.. బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో కానిస్టేబుల్ తలకు హెల్మెట్ ఉన్నప్పటికీ బలమైన గాయమైంది. అపస్మారక స్థితిలో పడిపోయిన ఉపేందర్‌ను 108లో మొదట గ్లోబల్ ఆస్పత్రికి, అనంతరం కిమ్స్ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. ప్రస్తుతం ఉపేందర్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

ఖమ్మం పార్లమెంట్ టికెట్ ప్రసాద్‌రెడ్డికి ఇవ్వాలి

- డాక్టర్ పిడమర్తి రవి

పంజాగుట్ట, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల్లో ఖమ్మం టికెట్‌ను కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోదరుడు పొంగులేటి ప్రసాద్ రెడ్డికి ఇవ్వాలని తెలంగాణ ఉద్యమకారుడు, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి పార్టీ అధిష్టానానికి, టీపీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్ రెడ్డికి శనివారం ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి రావడానికి ఖమ్మం జిల్లాలోనే కాకుండ, పార్టీ అభ్యర్థులకు అన్ని విధాలా సహాయసహకారాలు అందిస్తున్న శ్రీనివాస్ రెడ్డి సోదరుడికే టికెట్ ఇవ్వాలని కోరారు. లేకపోతే పొంగులేటి కుటుంబానికే చెందిన మాజీ మంత్రి ఆర్.సురేందర్ రెడ్డి కుమారుడు రఘురామ రెడ్డికి ఇచ్చినా అత్యధిక మెజారిటీతో గెలిపించుకుంటామన్నారు. స్థానికులకే టికెట్ ఇవ్వాలని ఇతర జిల్లాలకు చెందిన వారికి ఇవ్వవద్దని కోరారు.



చేనేత సిల్క్ ఎక్స్‌పోను ప్రారంభిస్తున్న వేణుగోపాల చారి, పక్కన నిర్వాహకులు

ఎన్టీఆర్ స్టేడియంలో జాతీయ చేనేత సిల్క్ ఎక్స్ పో

కవాడిగూడ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ఉన్న చేనేత కార్మికులు, చేతివృత్తుల వారు తయారు చేసిన చేనేత వస్త్రాలు, వస్తువులను కొనుగోలు చేసి వారిని ఆర్థికంగా ఆదుకుంటూ ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని కేంద్ర మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాలచారి అన్నారు. శనివారం రాత్రి నగరంలోని ఎన్‌టీఆర్ స్టేడియంలో అభ్యుదయ గ్రామీణ డ్వాక్రా రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాతీయ చేనేత సిల్క్ ఎక్స్‌పో ఎగ్జిబిషన్‌ను ఆయన రిటైర్డ్ జడ్జి జస్టిస్ మధుసూదన్‌రావుతో కలిసి ప్రారంభించారు. స్టేడియంలో ఏర్పాటు చేసిన దాదాపు 300 స్టాళ్లను సందర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉదయం 11 నుంచి రాత్రి 10గంటల వరకు నెల రోజులపాటు ఈ ఎగ్జిబిషన్ కొనసాగుతుందని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అభ్యుదయ గ్రామీణ డ్వాక్రా రాష్ట్ర అధ్యక్షురాలు కోట దేవకిదేవి, నిర్వాహకులు సత్యనారాయణచౌదరి, మహేష్‌సాయిచౌదరి, నదీమ్ పాల్గొన్నారు. ఈ ఎగ్జిబిషన్‌ను సందర్శించేందుకు వచ్చే వారికి ఆహ్లాదం పంచేందుకు కూచిపూడి, భరతనాట్యం, పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ కంచె ఐలయ్య

కార్పొరేట్ దిగ్గజాల కోసమే కమలం పార్టీ

- ప్రొఫెసర్ కంచె ఐలయ్య

రాంనగర్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): దేశంలో కార్పొరేట్ కంపెనీల ప్రయోజనాల కోసమే కమలం పార్టీ పనిచేస్తుందని ప్రముఖ రాజకీయ విశ్లేషకులు ప్రొఫెసర్ కంచె ఐలయ్య ఆరోపించారు. దేశాన్ని హిందుత్వ దేశంగా మార్చేందుకు డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ రాసిన రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీ ప్రభుత్వం కుట్ర చేస్తుందని ధ్వజమెత్తారు. మెజారిటీ ప్రజల అభివృద్ధికి దోహదపడ్డ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. శనివారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో సామాజిక సంఘాల ఆధ్వర్యంలో జరిగిన జ్యోతిరావు పూలే-అంబేడ్కర్ జనజాతర రాష్ట్ర సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాన్‌వెస్లీ, ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్‌బాబు, చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ రాష్ట్ర కో-కన్వీనర్ ఉడత రవీందర్, ఆవాజ్ కార్యదర్శి ఎండి.అబ్బాస్, టీపీఎస్‌కే కన్వీనర్ జి.రాములు, తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి శ్రీరాంనాయక్, ఓయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ అన్నపూర్ణ, నాయకులు భూపతి వెంకటేశ్వర్లు, గుమ్మడి గణేష్, దశరథ్, సుబ్బారావు పాల్గొన్నారు.



విశాల్ దివస్ కార్యక్రమంలో ప్రార్థనలు చేస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



ఊరేగింపులో మత గురువులు



కాంగ్రెస్ పార్టీ సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కోట నీలిమ ప్రత్యేక పార్థనలు చేసి బాటసారులకు మజ్జిగ పంపిణీ చేశారు. డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస రావు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వైశాఖి ఉత్సవాలు

- అమీర్‌పేటలో విశాల్ దివస్, నగర కీర్తన
- పూల రథంలో గురుగ్రంథం ఊరేగింపు
- అలరించిన యువతీ యువకుల విన్యాసాలు

అమీర్‌పేట, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): వైశాఖి ఉత్సవాల్లో భాగంగా విశాల్ దివస్, నగర కీర్తన కార్యక్రమాలను శనివారం ఘనంగా నిర్వహించారు. 325 ఖల్సాపంత్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అమీర్‌పేట పరిసర ప్రాంతాల్లో పండుగ వాతావరణం నెలకొంది. అట్టహాసంగా నిర్వహించిన వేడుకలకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు నగరంలోని పలు గురుద్వారాలకు చెందిన సిక్కులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఉదయం అమీర్‌పేట ధరంకరం రోడ్డులో ఉన్న గురుగోబింద్‌సింగ్ స్టేడియం ప్లే గ్రౌండ్‌లో విశాల్ దివస్ కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అమృత్‌సర్ నుంచి వచ్చిన సిక్కు మత గురువులు(రాగి జత్థాస్) గురుప్రీత్‌సింగ్ ఖల్సా, గుర్విందర్ సింగ్, విశాల్ సింగ్ బృందం గుర్బాణీ కీర్తనలు ఆలపిస్తూ గురుగ్రంథ పఠనం చేశారు. అనంతరం నిర్వహించిన ఆధ్యాత్మిక సంగీత విభావరి భక్తి పారవశ్యాన్ని కలిగించింది. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన గురుగ్రంథాన్ని సిక్కులు దర్శించుకుని పూజలు చేశారు. విశాల్ దివస్‌లో ప్రధాన ఘట్టమైన నగర్ కీర్తన్ కార్యక్రమంలో యువతీ యువకులు చేసిన ప్రదర్శనలు అలరించాయి. ఊరేగింపులో కత్తి యుద్ధం, గుర్రపు స్వారీ వంటి విన్యాసాలను ప్రదర్శించారు. వందలాది మంది సిక్కులు గురుగ్రంథాన్ని, సిక్కు సంప్రదాయ ఆయుధాలను ప్రదర్శనగా ఊరేగించారు. అమీర్‌పేట గురుద్వారా నుంచి సాయంత్రం ప్రారంభమైన ర్యాలీ లాల్ బంగ్లా, గ్రీన్‌ల్యాండ్స్, పంజాగుట్ట, అమీర్‌పేటల మీదుగా తిరిగి గురుద్వారాకు చేరింది. ఊరేగింపు సందర్భంగా దారిపొడవునా బాణసంచాను కాలుస్తూ, గుర్బాణీ కీర్తనలు ఆలపిస్తూ ముందుకు కదిలారు. దారి పొడవున పలువురు గురుగ్రంథకు ప్రత్యేక పూజలు చేశారు. ఈవేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్ఆర్‌నగర్, పంజాగుట్ట పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.



గురుగ్రంథం ఊరేగింపులో భక్తులు

- వైశాఖీ ఉత్సవాలను సిక్కులు అత్యంత ఘనంగా జరుపుకొనే పండుగ అని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, సికింద్రాబాద్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి పద్మారావు గౌడ్ పేర్కొన్నారు. అనంతరం తలసాని, పద్మారావు గౌడ్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వారిని గురుద్వారా ప్రతినిధులు సన్మానించారు. సిక్కు సమాజ్‌కు వైశాఖి ఉత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి సంవత్సరం వైశాఖిని పురస్కరించుకుని గురుద్వారాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించడం, భారీ ఊరేగింపులు ఆనవాయితీగా వస్తోందన్నారు. కార్యక్రమంలో గురుద్వారా అధ్యక్షులు దర్శన్ సింగ్, ప్రధాన కార్యదర్శి సురేందర్‌సింగ్, ఉపాధ్యక్షులు లాహోర్ సింగ్, సభ్యులు సుమిత్‌సింగ్, టిల్లు బాయ్, సురేందర్‌సింగ్‌తో పాటు ప్రవీణ్ రెడ్డి, కూతురు నర్సింహ, బలరాం పాల్గొన్నారు.

ఉత్సవాలను తిలకించిన మంత్రులు, ఎమ్మెల్యేలు

అమీర్‌పేట జీహెచ్‌ఎంసీ గ్రౌండ్‌లో జరుగుతున్న వైశాఖి ఉత్సవాలను తిలకించి ప్రత్యేక పార్థనలు చేసేందుకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ తదితరులు హాజరు కాగా వీరిని గురుద్వారా ప్రతినిధులు ప్రత్యేకంగా ఆహ్వానించి సన్మానించారు.

ముగిసిన ఉగాది పద్య నాటకోత్సవాలు



యయాతి పద్యనాటక ప్రదర్శనలో కళాకారులు

బంజారాహిల్స్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): ఉగాది పర్వదినం సందర్భంగా ఫిలింనగర్ ఫిలించాబర్ రామానాయుడు కళామండపంలో పొత్తూరి వెంకట సుబ్బారావు ఆధ్వర్యంలో జరుగుతున్న ఉగాది పద్యనాటకోత్సవాలు శనివారంతో ముగిశాయి. ఆఖరి రోజు యయాతి పద్యనాటకాన్ని సుమిత్ర యూత్ అసోసియేషన్ రంగస్థల నటులు ప్రదర్శించారు. గయోపాఖ్యానం యుద్ధసీనులో శ్రీకృష్ణుడిగా ఎన్.రవికుమార్, అర్జునుడిగా నీలిపూడి రంగారావు నటించారు. యయాతిగా చిలువేరు శాంతయ్య, వృషపర్వుడిగా డాక్టర్ నిభానుపూడి సుబ్బరాజు, శుక్రాచార్యుడిగా ఇనపనూరి వసంత్‌కుమార్, మంత్రిగా పంచాది రమణారావు, శర్మిష్టగా నంది అవార్డు గ్రహీత లహరి, దేవయానిగా అమృతవర్షిణి, య దువుగా అద్దంకి కృష్ణ, పూరుడుగా టి.కిషోర్‌రెడ్డి, సింగన్నగా నరాల సాంబశివారెడ్డి, గంగన్నగా రాజేందర్, తుర్వసుడుగా సుందర్‌నాయక్, వృద్ధయయాతిగా వడ్డి సూర్యప్రకాశ్ నటించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చి ఐదు రోజల పాటు కళాభిమానులను అలరించిన రంగస్థల నటులను వెంకట సుబ్బారావుతో పాటు పలువురు ఘనంగా సత్కరించారు.

మహిళా ఆర్ట్ ఎగ్జిబిషన్ ప్రారంభం



ప్రదర్శనను తిలకిస్తున్న ప్రముఖ కళాకారులు స్వామి ఉద్దండం, శివ కుమారి

పంజాగుట్ట, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): వెంగళరావునగర్ డివిజన్ మధురానగర్ హెచ్-బ్లాక్‌లోని ఎం.ఈశ్వరయ్య ఆర్ట్ గ్యాలరీలో 4వ మహిళా ఆర్ట్ ఎగ్జిబిషన్ శనివారం ప్రారంభమైంది. నగరానికి చెందిన 16 మంది కళాకారులు తమ చిత్రాలను ప్రదర్శించారు. ప్రివ్యూ షోను ప్రముఖ కళాకారుడు స్వామి ఉద్దండం, శివ కుమారి ఉద్దండం ప్రారంభించారు. నగరానికి చెందిన కళాకారులు చిన్న శ్రీపతి సత్య గన్నేజుతో పాటు పలువురు కళాకారులు పాల్గొన్నారు. ఈనెల 20వ తేదీ వరకు ఉదయం 11గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు ప్రదర్శన ఉంటుందని ఆర్ట్ గ్యాలరీ నిర్వాహకుడు ఎం.సంజయ్ కుమార్ తెలిపారు.

రాంబాబు చుండూరికి సీడ్స్ పురస్కారం



సీడ్స్ పురస్కారం అందుకుంటున్న శ్రీరామ అగ్రీ జెనిటిక్స్ లిమిటెడ్ చైర్మన్ రాంబాబు చుండూరి

పంజాగుట్ట, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగంలో 27 సంవత్సరాలుగా సేవలు అందిస్తున్న శ్రీరామ అగ్రీ జెనిటిక్స్ లిమిటెడ్ చైర్మన్ రాంబాబు చుండూరికి అగ్రీ పురస్కారం లభించింది. శనివారం రాత్రి నగరంలోని ఓ హోటల్లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో కేంద్ర వ్యవసాయ శాఖ కమిషనర్ డాక్టర్ పీకే సింగ్ చేతుల మీదుగా లీడర్ విత్ స్టాటిక్ విజన్ ఇన్ అగ్రీ బిజినెస్ సీడ్స్ పురస్కారాన్ని ఆయన అందుకున్నారు. కార్యక్రమంలో నాబార్డు తెలంగాణ రాష్ట్ర చీఫ్ జనరల్ మేనేజర్ చింతల సుశీల గోవిందరాజులు, ఇఫ్కో ప్రతినిధి తరుణ్ భార్గవ,నిమ్స్ మే డైరెక్టర్ జనరల్ గ్లోరీ స్వరూప, ఎస్‌బీఐ సీజీఎం రాజేశ్‌కుమార్, రే కన్స్ట్రక్షన్స్ ఎండీ రాజ్ కుమార్ అగర్వాల్ పాల్గొన్నారు.



డప్పు వాయిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

ఎస్సీ వర్గీకరణకు కృషి చేయాలి

బంజారాహిల్స్/కవాడిగూడ, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): మాదిగల చిరకాల ఆకాంక్ష అయిన ఎస్సీ వర్గీకరణకు కృషి చేయాలని టీఎమ్మార్పీఎస్, టీఎంహెచ్‌డీ సంఘాల ప్రతినిధులు సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. మాదిగ, ఉపకులాలకు ప్రత్యేక కార్పొరేషన్ ప్రకటించినందుకు శనివారం టీఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఇటుక రాజు మాదిగ, టీఎమ్మార్పీఎస్ యువసేన అధ్యక్షుడు నల్ల శివ మాదిగ, టీఎంహెచ్‌డీ వ్యవస్థాపక అధ్యక్షులు జున్ను కనకరాజు మాదిగ నేతృత్వంలో పలువురు నేతలు మాదిగల జాతి వృత్తి అయిన డప్పును ముఖ్యమంత్రికి బహూకరించారు. ఈ సందర్భంగా మాదిగలకు జరుగుతున్న అన్యాయం గురించి వివరించారు. అనంతరం వారు మాట్లాడుతూ మాదిగల సంక్షేమం కోసం తాము రూపొందించిన 10 డిమాండ్ల పత్రాన్ని ముఖ్యమంత్రికి అందజేశామని తెలిపారు. ఈ పార్లమెంటు ఎన్నికలతో పాటు కంటోన్మెంట్ ఉప ఎన్నికకు తమ సంఘాలు పూర్తి మద్దతు ఇస్తున్నాయని ప్రకటించారు. కార్యక్రమంలో టీఎంహెచ్‌డీ జాతీయ అధ్యక్షుడు వేముల బలరాం మాదిగ, ఇటుక గోపీ మాదిగ, సిరిసినోళ్ల బాలరాజు, కోరుపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ పాటల వీడియోను ఆవిష్కరించిన ప్రజాకవి జయరాజు, సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి తదితరులు

రాజ్యాంగాన్ని కాపాడుకుందాం

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): దేశ ప్రజల హక్కులు, భారత రాజ్యాంగాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రజాస్వామిక వాదులపై ఉందని ప్రజాకవి జయరాజు, సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి అన్నారు. అంబేడ్కర్ జయంత్యుత్సవాల సందర్భంగా శనివారం జూబ్లీహిల్స్ జర్నలిస్ట్‌కాలనీలో పబ్బతి శ్రీకృష్ణ రచించి, పాడిన దళిత జాతి బాస్కరా అంబేడ్కరా అనే పాటల వీడియోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇలాంటి పాటలు ప్రజలను చైతన్య పరిచే విధంగా ఉండాలని సూచించారు. అంబేడ్కర్‌పై పాటలు రాసిన పబ్బతి శ్రీకృష్ణను అభినందించారు. ఈకార్యక్రమంలో డా.దాసరి రంగ, మారోజు కాంతయ్య, శివాజీ, అరుణ తదితరులు పాల్గొన్నారు.


ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



సాంస్కృతిక కార్యక్రమంలో కళాకారులు

మాదాపూర్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాన్ బంగియా సమితి శిల్పారామం మాదాపూర్ సంయుక్త నిర్వహణలో బెంగాలీ నూతన సంవత్సరమైన 'పొయిలా బోయిషాక్' వేడుకను ఘనంగా నిర్వహించారు. బెంగాలీ సంప్రదాయ దుస్తులతో మహిళలు ఆకట్టుకున్నారు. చేనేత హస్తకళా యాథపతుల స్టాల్ ఏర్పాటు చేశారు. బెంగాలీ సంప్రదాయ దుస్తులు, చీరలు జ్యువెలరీ, పేయింటింగ్స్ మొదలైనవి సందర్శకులకు అందుబాటులో ఏర్పాటు చేశారు. బెంగాలీ సంప్రదాయ నృత్యాలు, పాటలు, రవీంద్రనాథ్ ఠాగూర్ రచించిన సాహిత్యంపై సంగీతం నృత్యాలు ఆకట్టుకున్నాయి. రోల్ (ఫ్రాంకీ బెంగాలీ వెర్షన్), షోండేష్ (స్వీట్‌మీట్) బెంగాలీ స్ట్రీట్, ఫ్రైడ్ ఫుడ్స్ వంటి ఐకానిక్ వంటకాల స్టాల్ ఏర్పాటు చేయడం జరిగింది. హైదరాబాద్‌లో నివసిస్తున్న బెంగాలీస్ కుటుంబాలు ఎక్కువ సంఖ్యాలో పాల్గొన్నారు.

టీపీసీసీ జూబ్లీహిల్స్ ఎస్సీ కమిటీ వైస్ చైర్మన్‌గా వెంకటేశ్వరరావు



బంజారాహిల్స్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): టీపీసీసీ జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఎస్సీ కమిటీ వైస్‌చైర్మన్‌గా ఎల్లారెడ్డిగూడకు చెందిన ఎం.వెంకటేశ్వరరావు నియమితులయ్యారు. ఈ మేరకు ఎస్సీ డిపార్ట్‌మెంట్ చైర్మన్ నగరిప్రీతమ్ శనివారం ఆయనకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. కాంగ్రెస్‌ను కింది స్థాయి నుంచి బలోపేతం చేసేందుకు నిరంతరం పని చేస్తామన్నారు. ఎస్సీలందరినీ ఒక తాటి మీదకు తీసుకొచ్చి రాబోయే ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

బ్రెయిన్‌డెడ్ వ్యక్తి అవయవాల సేకరణ

సనత్‌నగర్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): బ్రెయిన్‌డెడ్‌కు గురైన వ్యక్తి అవయవాలను జీవన్‌దాన్ సభ్యులు సేకరించారు. నల్గొండ జిల్లా నూతనకల్ మండలం అలుగునూరు ప్రాంతానికి చెందిన ఇటికల వెంకటేశ్వర్లు (35)ప్రైవేట్ ఉద్యోగి. ఈనెల 9వ తేదీ రాత్రి 9.30గంల సమయంలో బైక్‌పై వెళ్తుండగా ప్రమాదవశాత్తు కిందపడిపోయాడు. తలకు తీవ్ర గాయాలు కావడంతో కుటుంబ సభ్యులు ఎల్‌బీనగర్ కామినేని ఆస్పత్రికి తరలించారు. చికిత్సకు స్పందించకపోవడంతో వైద్యులు బ్రెయిన్‌డెడ్‌గా నిర్ధారించారు. జీవన్‌దాన్ సభ్యులు వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులను అవయవదానానికి ఒప్పించారు. వెంకటేశ్వర్లు శరీరంలోని 2 కిడ్నీలు, లివర్, 2 కార్నియాలను సేకరించారు.

ఆలయ వార్షికోత్సవం

బంజారాహిల్స్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): బంజారాహిల్స్ రోడ్‌నెంబర్-2 ఇందిరానగర్ శ్రీరామ వీధిలోని సీతారామచంద్రస్వామి ఆలయం ప్రథమ వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా ఆలయంలో విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించినట్టు ఆలయ ప్రధాన అర్చకులు మోటుపల్లి కిరణ్ కుమార్ ఆచార్యులు, శేషాచార్యులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త బాలరాజు పాల్గొన్నారు. ఐదు రోజుల పాటు ఆలయ ప్రథమ బ్రహ్మోత్సవాలు నిర్వహించడంతో పాటు, సాయిబాబా వార్షికోత్సవాలు కూడా నిర్వహిస్తున్నట్టు తెలిపారు.


ఫొటో, వీడియోగ్రాఫర్లను ప్రభుత్వం ఆదుకోవాలి

- ఎంపీ ఆర్.కృష్ణయ్య

రాంనగర్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఫొటో, వీడియోగ్రఫీ వృత్తిని స్వయం ఉపాధి కింద తీసుకువచ్చి ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీ రుణాలు అందించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని ఎంపీ ఆర్.కృష్ణయ్య తెలిపా రు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఫ్రీలాన్స్ ఫొటోగ్రాఫర్స్, వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ రూపొందించిన డైరీ ఆవిష్కరణ జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఆర్.కృష్ణయ్య డైరీని ఆవిష్కరించి మాట్లాడారు. చరిత్రకు సజీవ సాక్ష్యం ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ అన్నారు. ఇటువంటి ఈ రంగంపై ఎన్నో వేల కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నాయని, ప్రభుత్వం వీరిని ఆదుకోవాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ వ్యవస్థాపకుడు జి.శ్రీధర్, అధ్యక్ష, కార్యదర్శులు ఎ.రుషీశ్వర్, జి.కరుణాకర్, కోశాధికారి ఎం.వేణు, ఉపాధ్యక్షుడు కె.వీరేష్, సంయుక్త కార్యదర్శులు ఎం. ఉదయ్, కె. కుమార్, ఎస్. శ్రీనివాస్, మహ్మద్ హబీబ్, ఆర్గనైజర్లు పి.కృష్ణ, వి.ఎస్. వెంకట్, కార్యనిర్వాహక కార్యదర్శులు వెంకి. యాదవ్, వై. చందు, కార్యదర్శులు కిషోర్, కె. అక్షయ్, సభ్యులు ఎస్. సతీష్, పి. నరేష్, గోవింద్, సలహాదారు కె.రఘురామ్, లీగల్ అడ్వయిజర్ వేణుమాధవ్ పాల్గొన్నారు.

మోకాలి శస్త్రచికిత్సలో అధునాతన పద్ధతులు

- డా.కె.రఘువీర్‌రెడ్డి



లైవ్ సర్జరీ కాన్ఫరెన్స్-2024లో మాట్లాడుతున్న డాక్టర్లు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మోకాలి శస్త్రచికిత్సలో ఆధునాతన పద్ధతులు అందుబాటులోకి వస్తున్నాయని డా.కె.రఘువీర్‌రెడ్డి అన్నారు. సాయి ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్ ఇంజురీ ఆర్థ్రోస్కోపీ 25 ఏళ్ల సేవలు పూర్తి చేసిన సందర్భంగా హైటెక్స్ కన్వెన్షన్ సెంటర్‌లో శనివారం లైవ్ సర్జరీ కాన్ఫరెన్స్-2024ను నిర్వహించారు. రెండు రోజులపాటు నిర్వహిస్తున్న సదస్సులో ఆర్థోపెడిక్ సర్జన్లు ఈ రంగంలో మెళకువలు తెలుసుకునేందుకు, తమ అనుభవాలు పరస్పరం పంచుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. దేశంలోని పలు ప్రాంతాల నుంచి సుమారు 400 మంది సర్జన్లు సదస్సులో పాల్గొంటారని ఆర్గనైజింగ్ సెక్రటరీ డా.కె.రఘువీర్‌రెడ్డి, డా.అడ్రియన్ విల్సన్ తెలిపారు. ఈ సందర్భంగా పలువురు వైద్యులు మాట్లాడుతూ మోకాలి కీళ్ల సంరక్షణలో నాన్ సర్జికల్, సర్జికల్ చికిత్సలు రెండూ ఉన్నాయని, దీనికి విరుద్ధంగా మోకాలి మార్పిడి అనే పద్ధతిలో మోకాలికీలులో దెబ్బతిన్న భాగాలు తొలగించి, వాటి స్థానంలో కృత్రిమ భాగాలను భర్తీ చేయడం జరుగుతుందన్నారు. రీఆలైన్‌మెంట్ ఆస్టియోటమి, మెనిస్కస్(జాయింట్ స్పాంజ్), లిగమెంట్, కార్టిలేజ్ శస్త్రచికిత్సల వంటి ఆధునాతన పద్ధతులున్నాయని తెలిపారు. హై టిబియల్ ఆస్టియోటమీ(హెచ్‌టీఓ) అనేది ఒక శస్త్ర చికిత్స ప్రక్రియని, దీనిలో మోకాలి కీలు కింద ఉన్న షిన్ ఎముకను కత్తిరించడం ద్వారా వంకర కాలును నిటారుగా చేయవచ్చన్నారు. ఆస్టియోటమీతో దెబ్బతిన్న మోకాలి కీలు మార్పిడి అవసరం లేకుండానే మోకాళ్ల నొప్పులు తగ్గించవచ్చన్నారు. కాలు ముడుచుకుని కూర్చునే రోజువారీ కార్యకలాపాలపై ఎటువంటి పరిమితులుండవని, కృత్రిమ మోకాలి కీలుతో పోలిస్తే సహజ మోకాలి స్థిరత్వం ఎక్కువగా ఉంటుందన్నారు. మోకాలి ఆస్టియోటమీ తర్వాత కోలుకునేందుకు సాధారణంగా 6 నుంచి 12 వారాల సమయం పడుతుందన్నారు. సదస్సులో డా.క్రిస్టియన్ క్లే, దేశంలోని 20 మంది ప్రముఖ సర్జన్లు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ స్టాక్ ట్రేడింగ్ పేరుతో రూ.10.90 లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్‌లో ట్రేడింగ్ చేస్తే తక్కువ సమయంలోనే ఎక్కువ లాభాలు వస్తాయని నమ్మించిన సైబర్ నేరగాళ్లు, సికింద్రాబాద్‌కు చెందిన వ్యక్తి నుంచి రూ.10.90లక్షలు కాజేశారు. నగరానికి చెందిన ప్రైవేటు ఉద్యోగి(52)కి వాట్సప్‌లో స్టాక్ ట్రేడింగ్ టిప్స్ పేరుతో సందేశం వచ్చింది. దాన్ని అనుసరించిన వ్యక్తితో ఎలోకేపీఎస్ఎల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేయించిన సైబర్ నేరగాళ్లు 200 మంది సభ్యులున్న గ్రూపులో యాడ్ చేశారు. ముందుగా కొద్ది మొత్తాల్లో పెట్టుబడి పెట్టించి లాభాలు చూపారు.

తర్వాత ఆటోమేటిక్‌గా అప్‌డేట్ అంటూ ఖాతాలోని రూ.10.90 లక్షలు వసూలు చేశారు. లాభం రూ.20లక్షలు వచ్చిందని యాప్‌లో చూపించారు. ఈ డబ్బు తీసుకోవాలంటే రూ.34లక్షలు చెల్లించాలని షరతు పెట్టారు లేని పక్షంలో ఎకౌంట్ సీజ్ అవుతుందని భయపెట్టారు. దాంతో మోసపోయానని గ్రహించిన బాధితుడు సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.


సీతారాముల కల్యాణ మహోత్సవ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కార్ఖానా ఏసీపీ రమేష్

సీతారాముల కల్యాణ మహోత్సవ ఏర్పాట్లు

తిరుమలగిరి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): బొల్లారం డౌటన్ బజార్‌లోని హనుమాన్ దేవాలయంలో సీతారాముల కల్యాణ మహోత్సవానికి జరుగుతున్న ఏర్పాట్లను ఏసీపీ రమేష్ శనివారం పరిశీలించారు. ఈఓ మహేందర్ రెడ్డి, మాజీ చైర్మన్ జీవీ.శ్రీనివాస్, బాబు సుందరం తదితరులు పాల్గొన్నారు.

8వ వార్డు బీఆర్ఎస్ ముఖ్య నాయకుల సమావేశం

తిరుమలగిరి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదితను కేసీఆర్ నియమించిన నేపథ్యంలో కంటోన్మెంట్ నియోజకవర్గం వార్డ్-8 మాజీ బోర్డు సభ్యుడు లోక్‌నాథం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ముఖ్య నాయకుల సమావేశానికి ఎన్నికల ఇన్‌చార్జి రావుల శ్రీధర్ రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత హాజరయ్యారు. కార్యక్రమంలో బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి, చందర్, బాల్‌రాజ్, రమేష్, ఉదయ్ కుమార్, ఉమేష్ పాల్గొన్నారు.

లాల్ బజార్‌లో పట్నం సునీతారెడ్డి పాదయాత్ర

తిరుమలగిరి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ వార్డ్-7లో శనివారం కాంగ్రెస్ పార్టీ మల్కాజిగిరి లోక్‌సభ అభ్యర్థి పట్నం సునీతారెడ్డి, కంటోన్మెంట్ కాంగ్రెస్ అభ్యర్థి శ్రీగణేశ్‌లు లాల్‌బజార్, శాస్త్రినగర్, గాంధీనగర్, బొల్లారంలోని పెద్దమ్మ బజార్‌లలో పాదయాత్ర చేశారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయాన్ని ఎవరూ ఆపలేరని ప్రత్యర్థులకు డిపాజిట్ కూడా దక్కదని వారన్నారు. కాంగ్రెస్ శ్రేణులు, అభిమానులు పెద్ద ఎత్తున పాదయాత్రలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు వెన్నెల, ఆర్టీసీ మాజీ చైర్మన్ కొత్త సంజీవరెడ్డి, బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జయప్రకాష్, రవీందర్‌గుప్త, రేమండ్ హార్వుడ్ పాల్గొన్నారు.

25 నుంచి ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు

బాలానగర్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు ఈనెల 25 నుంచి ప్రారంభమవుతాయని, మే 2వరకు జరుగుతాయని ఓపెన్ స్కూల్ సొసైటీ డైరెక్టర్ శ్రీహరి తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఒక సెషన్, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు మరో సెషన్ పరీక్షను నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. టాస్ వెబ్‌సైట్ నుంచి హాల్‌టిక్కెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ఆయన తెలిపారు.

ప్రతి రైలులో ఐదు సాధారణ బోగీలను పెంచాలి

- డాక్టర్ పరికిపండ్ల అశోక్

బౌద్ధనగర్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రతి రైలులో సాధారణ బోగీల సంఖ్యను ఐదుకు పెంచాలని ఐదుసాధారణ బోగీల సాధన సమితి జాతీయ కన్వీనర్ డాక్టర్ పరికిపండ్ల అశోక్ డిమాండ్ చేశారు. ఐదు సాధారణ బోగీల సాధన కోసం ప్రధానమంత్రికి దేశవ్యాప్తంగా కోటి ఉత్తరాల గాంధీ మార్గంలో ఉద్యమాన్ని ప్రారంభినట్లు తెలిపారు. ప్రతిరోజు దేశవ్యాప్తంగా సుమారు ముప్పైకోట్ల మంది రైళ్ల ద్వారా ప్రయాణిస్తున్నట్లు అనధికార అంచనా ఉండగా, ఈ ప్రయాణంలో జనరల్ బోగీల్లో ప్రయాణించే సామాన్యుల పరిస్థితి దయనీయంగా ఉందని, సీట్లు తక్కువ ఉండటంతో, బోగీల్లో స్థలం లేకపోవటంతో, తొక్కిసలాటలు, కొన్ని సందర్భాల్లో తీవ్ర గాయాలై చిన్నారుల ప్రాణాలు పోయిన సందర్భాలున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ అంశాన్ని భారతదేశంలోని ప్రతి ఒక్కరూ ఒక సామాజిక బాధ్యతగా స్వీకరించి ది ప్రైమ్ మినిస్టర్, ప్రైమ్ మినిస్టర్ ఆఫీస్, 152 సౌత్‌బ్లాక్, రైసినా హిల్స్, న్యూఢిల్లీ-110011 చిరునామాకు ఉత్తరాలను పంపాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు 998931041 ఫోన్‌లో సంప్రదించాలని కోరారు.


ట్రాఫిక్ సిబ్బందితో మాట్లాడుతున్న అడిషనల్ డీసీపీ రంగారావు

విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ

రెజిమెంటల్‌బజార్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా విధుల్లో అప్రమత్తంగా ఉండాలని ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ రంగారావు అన్నారు. శనివారం గోపాలపురం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సంగీత్ చౌరస్తా, క్లాక్‌టవర్, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, వైఎంసీఏ ప్రాంతాలను పరిశీలించారు. ట్రాఫిక్ సమస్య ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. ట్రాఫిక్ సాఫీగా వెళ్లడానికి తీసుకోవలసిన చర్యలు వివరించారు. ఈ కార్యక్రమంలో నార్త్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్ రాజు, గోపాలపురం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకట్‌రాములు, ఎస్సైలు సతీష్, బసు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


వైశాఖి ఉత్సవాలను పురస్కరించుకొని అమీర్‌పేట ధరంకరం రోడ్డు జీహెచ్ఎంసీ మైదానంలో నిర్వహించిన విశాల్ దివస్ కార్యక్రమంలో ప్రార్థనలు చేస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి


ఊరేగింపులో మత గురువులు


గురుగ్రంథం ఊరేగింపులో భక్తులు

వైభవంగా వైశాఖి ఉత్సవాలు

- అమీర్‌పేటలో విశాల్ దివస్, నగర కీర్తన
- పూల రథంలో గురుగ్రంథం ఊరేగింపు
- అలరించిన యువతీ, యువకుల విన్యాసాలు

అమీర్‌పేట, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): వైశాఖి ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన విశాల్ దివస్, నగర కీర్తన కార్యక్రమాలను శనివారం ఘనంగా నిర్వహించారు. 325 ఖల్సాపంత్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అమీర్‌పేట పరిసర ప్రాంతాల్లో పండుగ వాతావరణం నెలకొంది. అట్టహాసంగా నిర్వహించిన వేడుకలకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు నగరంలోని పలు గురుద్వారాలకు చెందిన సిక్కులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఉదయం అమీర్‌పేట ధరంకరం రోడ్డులో ఉన్న గురుగోబింద్‌సింగ్ సేడియం ప్లే గ్రౌండ్‌లో విశాల్ దివస్ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమృత్‌సర్ నుంచి వచ్చిన సిక్కు మత గురువులు (రాగి జత్థాస్) గురుప్రీత్‌సింగ్ ఖల్సా, గుర్విందర్ సింగ్, విశాల్ సింగ్ బృందం గుర్బాణీ కీర్తనలు ఆలపిస్తూ గురుగ్రంథ పఠనం చేశారు. అనంతరం నిర్వహించిన ఆధ్యాత్మిక సంగీత విభావరి భక్తి పారవశ్యాన్ని కలిగించింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన గురుగ్రంథాన్ని సిక్కులు దర్శించుకుని పూజలు చేశారు. విశాల్ దివస్‌లో ప్రధాన ఘట్టమైన నగర్ కీర్తన్ కార్యక్రమంలో యువతీ, యువకులు చేసిన ప్రదర్శనలు అలరించాయి. ఊరేగింపులో కత్తి యుద్ధం, గుర్రపు స్వారీ వంటి విన్యాసాలను ప్రదర్శించారు. వందలాది మంది సిక్కులు గురుగ్రంథాన్ని, సిక్కు సంప్రదాయ ఆయుధాలను ప్రదర్శనగా ఊరేగించారు. అమీర్‌పేట గురుద్వారా నుంచి సాయంత్రం ప్రారంభమైన ర్యాలీ లాల్‌బంగ్లా, గ్రీన్‌ల్యాండ్స్, పంజాగుట్ట, అమీర్‌పేట్‌ల మీదుగా తిరిగి గురుద్వారాకు చేరింది. ఊరేగింపు సందర్భంగా దారిపొడవునా బాణసంచాను కాలుస్తూ, గుర్బాణీ కీర్తనలు ఆలపిస్తూ ముందుకు కదిలారు. దారి పొడవునా పలువురు గురుగ్రంథకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్ఆర్‌నగర్, పంజాగుట్ట పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గురుద్వారా అధ్యక్ష, కార్యదర్శులు దర్శన్‌సింగ్, సురేందర్‌సింగ్, ఉపాధ్యక్షులు లాహోర్‌సింగ్, కుశ్వంత్‌సింగ్, చైర్మన్ అజిత్‌సంగ్, తదితరులు పాలొన్నారు.

- సిక్కులు అత్యంత ఘనంగా జరుపుకొనే పండుగ వైశాఖీ ఉత్సవాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, సికింద్రాబాద్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి పద్మారావు గౌడ్ అన్నారు. అనంతరం తలసాని, పద్మారావుగౌడ్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వారిని గురుద్వారా ప్రతినిధులు సన్మానించారు. సిక్కు సమాజ్‌కు వైశాఖి ఉత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి సంవత్సరం వైశాఖిని పురస్కరించుకుని గురుద్వారాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించడం, భారీ ఊరేగింపులు ఆనవాయితీగా వస్తోందన్నారు. కార్యక్రమంలో గురుద్వారా అధ్యక్షులు దర్శన్‌సింగ్, ప్రధాన కార్యదర్శి సురేందర్ సింగ్, ఉపాధ్యక్షులు లాహోర్ సింగ్, సభ్యులు సుమిత్‌సింగ్, టిల్లు భాయ్, సురేందర్‌సింగ్‌తో పాటు ప్రవీణ్ రెడ్డి, కూతురు నర్సింహ, బలరాం పాల్గొన్నారు.

ఉత్సవాలను తిలకించిన మంత్రులు, ఎమ్మెల్యేలు

అమీర్‌పేట జీహెచ్ఎంసీ గౌండ్‌లో జరుగుతున్న వైశాఖీ ఉత్సవాలను తిలకించి ప్రత్యేక పార్థనలు చేసేందుకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ తదితరులు హాజరుకాగా, వీరిని గురుద్వారా ప్రతినిధులు ప్రత్యేకంగా ఆహ్వానించి సన్మానించారు.

కాంగ్రెస్ గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

- సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి దానం నాగేందర్


సికింద్రాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో ఎంపి అభ్యర్థి దానం నాగేందర్, రాజ్యసభ సభ్యులు అనిల్‌కుమార్, స్థానిక నాయకులు

తార్నాక, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లి సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి దానం నాగేందర్ అన్నారు.

శనివారం లాలాపేట్‌లోని నఫీజ్ గార్డెన్‌లో సికింద్రాబాద్ నియోజకవర్గం ఇన్‌చార్జి ఆదం సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ బూత్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దానం నాగేందర్‌తో పాటు, జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతాశోభన్‌రెడ్డి ముఖ్య అతిథులుగా విచ్చేసి ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా దానం నాగేందర్ మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా కేంద్రంలో, రాష్ట్రంలో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు చేసిన అక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లడంతో పాటు, కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీ పథకాలను ప్రతి ఒక్కరికీ వివరించాలని పిలుపునిచ్చారు. అనంతరం డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి మాట్లాడుతూ వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాలు గెలుపొంది కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని, అదేవిధంగా తెలంగాణ రాష్ట్రంలో 14 పార్లమెంట్ స్థానాలను కైవసం చేసుకుంటామని ధీమా వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్, కోట నీలిమ, జీడీ అమర్‌నాథ్ గౌడ్, ఆదం సుజన్, ఆదం ఉమాదేవి, బ్రహ్మజీ, సందీప్‌రాజ్, గంటరాజు, శైలేందర్, శేఖర్‌గౌడ్, జలందర్‌రెడ్డి, షకీల్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.


మీడియా సమావేశంలో మాదిగ సంఘాల నాయకులు

శ్రీగణేష్ క్షమాపణ చెప్పాలి

- మాదిగ సంఘాల నాయకుల డిమాండ్

బోయినపల్లి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ టికెట్ మాదిగలకు కేటాయించని బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలను అడ్డుకుంటామని ఎంఆర్‌పీఎస్ నాయకుడు శ్రీకిషన్ మాదిగ హెచ్చరించారు. బోయినపల్లి డైమండ్ పాయింట్‌లో శనివారం కంటోన్మెంట్ మాదిగ సంఘాల నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ అభ్యర్థి శ్రీగణేష్ మాదిగలను అవమానిస్తున్నారని, ఆయన వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రచారంలో శ్రీగణేష్‌ను అడ్డుకుంటామని, ఆయనకు ఓటు వేయకూడదని మాదిగలకు పిలుపునిచ్చారు. బీజేపీ నుంచి టికెట్ ఆశిస్తున్న వంశతిలక్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాదిగలపై వివక్ష చూపిస్తూ అవమానపరుస్తున్నారని ఆరోపించారు. కంటోన్మెంట్ అభ్యర్థిగా బీజేపీ తనకు అవకాశం కల్పిస్తే గెలిచి కిషన్‌రెడ్డికి బహుమతిగా ఇస్తానని అన్నారు. సమావేశంలో కంటోన్మెంట్ దళిత సంఘాల నాయకులు అజిత్, మురళి, శ్రీకాంత్ మాదిగ, రొట్టెల సునీల్ మాదిగ, మంద మధుకర్, నర్సింహ, రాజు శివ పాల్గొన్నారు.

దానం నాగేందర్ రాజీనామా చేయాలి

- బీఆర్ఎస్ పార్టీ నాయకుల నిరసన


లాలాపేట్‌లోని డా. బీఆర్ అంబేద్కర్ చౌరస్తాలో ప్లకార్డులు పట్టుకుని నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు

తార్నాక, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ పార్టీ తరుపున పోటీ చేసి గెలుపొందిన ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ తన పదవికి రాజీనామా చేసిన తరువాతే కాంగ్రెస్ పార్టీ తరుపున పోటీ చేసి గెలవాలని బీఆర్ఎస్ పార్టీ గ్రేటర్ హైద్రాబాద్ యువజన విభాగం అధ్యక్షుడు ఆలకుంట హరి అన్నారు. శనివారం లాలాపేట్‌లో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ బూత్ కమిటీ సమావేశానికి దానం నాగేందర్ హాజరవుతారని సమాచారం తెలుసుకున్న తార్నాక డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు లాలాపేట్‌లోని డా.బీఆర్ అంబేద్కర్ చౌరాస్తాలో ప్లకార్డులు పట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్ పార్టీ నాయకులను, కార్యకర్తలను లాలాగూడా పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు సునీల్ ముదిరాజ్, ప్రశాంత్, బందెల స్వామి, నాచారం బలరాం, రాజనర్సింహ్మా, ఎండీ ఇమ్రాన్, యాదగిరి పాల్గొన్నారు.


చెత్త వేయొద్దని బొట్టుపెట్టి చెబుతున్న జీహెచ్ఎంసీ సిబ్బంది

స్వచ్ఛత కోసం డప్పుకొట్టి, బొట్టుపెట్టి..

- బహిరంగ ప్రదేశాలలో చెత్త వేయవద్దని ప్రచారం

రెజిమెంటల్‌బజార్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): బహిరంగ ప్రదేశాలలో చెత్త పారవేయకుండా స్వచ్ఛ ఆటోలకు ఇవ్వాలని జీహెచ్ఎంసీ డీఈఈ శ్రీనివాస్‌రావు ప్రజలకు విజ్ఞప్తిచేశారు. శనివారం మోండా డివిజన్ రెజిమెంటల్‌బజార్ వీధులలో డప్పుచప్పుడుతో తిరుగుతూ ఇళ్లు, దుకాణాల యజమానులకు బొట్టు పెడుతూ, చెత్తను బయట వీధులలో పడేయరాదని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాత్రివేళలో రోడ్ల మీద చెత్త వేస్తున్న డంపింగ్ ప్రాంతాలను గుర్తించి సిబ్బంది సహకారంతో చెత్త వేయకుండా నివారించామని, ఇప్పుడు ఆ ప్రాంతాలు పరిశుభ్రంగా ఉన్నాయని అన్నారు. రోడ్ల మీద చెత్త వేస్తే జరిమానా విధిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఎస్.ధనాగౌడ్, జవాన్‌లు నర్సింగరావు, రాజు, ప్రభాకర్, ఎస్ఎఫ్ఏ రేణులత, యాదగిరి, శ్రీనివాస్, యుసీడీలు దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి కోసం నరేంద్రమోదీకి అవకాశమివ్వాలి

- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి


ఆర్ట్స్‌కాలేజీ టర్నింగ్ పాయింట్ వద్ద ప్రజలకు అభివాదం చేస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

బౌద్ధనగర్, ఏప్రిల్13(ఆంధ్రజ్యోతి): భారతదేశం అభివృద్ధి చెందాలంటే ప్రధాన మంత్రి నరేంద్రమోదీని మరోసారి గెలిపించాలని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. శనివారం రాత్రి బౌద్ధనగర్, సీతాఫల్‌మండి డివిజన్లో పలు ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఆర్ట్స్‌కాలేజీ టర్నింగ్ పాయింట్ వద్ద ప్రారంభమైన ప్రచారం బౌద్ధనగర్, రామచంద్రనగర్, అంబర్‌నగర్, పార్శిగుట్ట, అశోక్‌నగర్, ఎల్.నారాయణనగర్, వారాసిగూడల మీదుగా ఇందిరానగర్‌కాలనీ తదితర ప్రాంతాల్లో సాగింది. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ ఈరోజు ప్రపంచదేశాల్లో భారతదేశం అగ్రగామిగా నిలిచిందంటే ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేసిన అభివృద్ధేనన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మహంకాళి సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్‌గౌడ్, ప్రధానకార్యదర్శి మేకల సారంగపాణి, రాష్ట్ర కార్యవర్గసభ్యుడు పి.రవిప్రసాద్‌గౌడ్, మాజీ మేయర్ బండకార్తీకరెడ్డి, ఉపాధ్యక్షుడు రాచమల్ల కృష్ణమూర్తి, కన్వీనర్ కందాడినాగేశ్వరరెడ్డి, ముఖ్యనాయకులు కనకట్ల హరి, మద్దెర్ల శ్యాంసుందర్, దేశబోయిన రఘు, శారదామల్లేష్, ప్రభుగుప్తా, మాజీ కార్పొరేటర్ స్వరూపగౌడ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో..

యాజమాన్య కమిటీ వేయాలి

- సీ.హెచ్.లక్ష్మీనారాయణ


పాఠశాల యజమాన్య కమిటీ సమావేశంలో మహిళలు

అడ్డగుట్ట, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో యాజమాన్య కమిటీ వేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలంగాణ బాలల హక్కుల పరిరక్షణ వేదిక జిల్లా కార్యదర్శి సీ.హెచ్.లక్ష్మీనారాయణ సూచించారు. శనివారం అడ్డగుట్టలో మండల పరిధిలోని యాజమాన్య కమిటీలు తల్లుల సంఘం, బాలల హక్కుల పరిరక్షణ వేదికల సంయుక్త ఆధ్వర్యంలో మండల ప్రత్యేక సమావేశ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల యాజమాన్య కమిటీ వేసేందుకు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీని రద్దు చేయాలని కోరుతూ మారేడుపల్లి రెవెన్యూ కార్యాలయం వద్ద ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేసిన అనంతరం, అడ్డగుట్టలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వం జారీ చేసిన జీఓ నెంబరు ఎంఎస్ 5, విద్యాశాఖ జారీ చేసిన జీఓను ఉపసంహరించుకోవాలని డిమాండు చేశారు. అదేవిధంగా ఇదివరకు ఉన్న ప్రభుత్వ పాఠశాలలో యాజమాన్య కమిటీని అలాగే ఉంచాలని ప్రభుత్వాన్ని కోరారు. తమ పిల్లల భవిష్యత్తు కోసం ఏర్పడిన పాఠశాల నిర్వహణ, మౌలిక సదుపాయాలు, ఉపాధ్యాయులతో, స్థానిక సంస్థలతో, ప్రభుత్వ అధికారులతో సంప్రదింపులు జరపడం ద్వారా దళిత, గిరిజన, బడుగు, బలహీనవర్గాల ప్రజలను పాలనలో భాగస్వామ్యం చేసిందన్నారు. ప్రభుత్వం జారీచేసిన అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలకు పొదుపు గ్రూపుల సంఘాలకు అప్పగించడం ద్వారా తల్లిదండ్రుల పాత్ర నిర్వీర్యం అవుతుందన్నారు.

కార్యక్రమంలో పాఠశాల యజమాన్య కమిటీ కన్వీనర్ గోపి, కౌసల్య, సీఆర్‌పీఎఫ్ మండల కన్వీనర్ ప్రవీణ్‌కుమార్, సభ్యురాళ్లు శోభ, పుష్ప, పృథ్వీరాజ్, పేరెంట్స్ కమిటీ సభ్యురాలు సుల్తానాబేగం, అనిత, నజీమామేరీ, భవాని ఎంపీ ఫౌండేషన్ ఆర్గనైజర్లు సువర్ణ, భాగ్య, రెమెడియల్ టీచర్లు లావణ్య, సౌజన్య క్రాంతి, రేఖ పాల్గొన్నారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వెంకయ్యనాయుడు, వంశీ రామరాజు

కామన్ సెన్స్ గ్రంథావిష్కరణ

చిక్కడపల్లి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): వంశీ ఆర్ట్ థియేటర్స్ స్వర్ణోత్సవ వేడుకల్లో భాగంగా వారణాసి మాధురి రచించిన కామన్ సెన్స్ గ్రంథాన్ని మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు ఆయన నివాసంలో శనివారం ఆవిష్కరించారు. వంశీ సంస్థల అధినేత డా.వంశీ రామరాజు ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆవిష్కరించిన గ్రంథాన్ని ఉగాండా వాస్తవ్యులైన తెలుగువారు రాధ, వ్యాస కృష్ణలకు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో కూచి సాయిశంకర్ తదితరులు పాల్గొన్నారు.


అగ్నిప్రమాదాల పట్ల అవగాహన కల్పించేవిధంగా రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఓయూ వీసీ డా.రవీందర్, అగ్నిమాపక శాఖ అధికారులు

జాతీయ అగ్నిమాపక దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ

తార్నాక, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఏప్రిల్ 14 జాతీయ అగ్నిమాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉస్మానియా యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ డా.రవీందర్ అగ్నిమాపక శాఖ అధికారులతో కలిసి శనివారం ఓయూలోని తన కార్యాలయంలో అగ్నిప్రమాదాల పట్ల అవగాహన కల్పించేవిధంగా రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డా.రవీందర్ మాట్లాడుతూ ఈనెల 14 నుంచి 20 వరకు ప్రజలకు అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించేందుకు వారం రోజులపాటు నిర్వహించే అగ్నిమాపక వారోత్సవాలలో విద్యార్థులను భాగస్వామ్యం చేసి వర్సిటీ పరిధిలోని అన్ని విద్యాసంస్థల్లో అగ్నిప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రతల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించేవిధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హైద్రాబాద్ జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి మధుసూదన్‌రావు, ఏడీఎఫ్ఓ సురేష్‌రెడ్డి, ధనుంజయ్ రెడ్డి, ఎస్ఎఫ్ఓ కె.రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొడుకును చూసేందుకు వచ్చిన తల్లి అదృశ్యం


లలిత


అడ్డగుట్ట, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): కొడుకును చూసేందుకు వచ్చిన తల్లి సికింద్రాబాద్‌లో అదృశ్యమైన ఘటన గోపాలపురం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై వేణుగోపాల్ తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి గాంధీనగర్‌కు చెందిన లలిత(47)కు ఇద్దరు కుమారులు. సికింద్రాబాద్, బేగంపేట్‌లోని వెల్‌నెస్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పెద్ద కొడుకును చూసేందుకు ఈనెల 11న వనపర్తి నుంచి హైద్రాబాద్‌కు వచ్చింది. ముందుగా ఈసీఐఎల్‌లో ఉంటున్న చిన్నకొడుకు వద్దకు వచ్చి, అతనితో కలిసి వెల్‌నెస్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పెద్దకుమారుడిని కలిసింది. అనంతరం చిన్నకుమారుడితో కలిసి సికింద్రాబాద్‌కు చేరుకున్న ఆమె బస్‌స్టాప్ వద్ద కనిపించకుండా పోయింది. దీంతో తల్లి కోసం చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలించినా ఫలితం లేకపోయింది. వెంటనే బంధువుల సాయంతో ఆమె కుమారుడు గోపాలపురం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదుచేసుకున్న పోలీసులు సీసీ ఫుటేజీలను పరిశీలించారు. ఆమె జాడ లేకపోవడంతో పోలీసులు మిస్సింగ్ కేసుగా నమోదు చేసుకుని, ఆమె కోసం గాలిస్తున్నారు. ఎక్కడి నుంచి ఎక్కడికి వచ్చింది, సికింద్రాబాద్ నుంచి ఏ నెంబరు బస్సు ఎక్కిందనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. లలిత ఆచూకీ తెలిస్తే వెంటనే 8712661249 నెంబరుకు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యం స్వాధీనం


స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

సనత్‌నగర్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా రేషన్ బియ్యం నిల్వ ఉంచిన ఇంటిపై దాడిచేసిన బాలానగర్ ఎస్ఓటీ, సనత్‌నగర్ పోలీసులు 400 కిలోల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. బోరబండ మోతీనగర్‌కు చెందిన ఓంప్రకాష్ (50) అదే ప్రాంతంలో కిరాణా దుకాణం నిర్వహిస్తున్నాడు. ఇతడు తక్కువ ధరకే రేషన్ బియ్యం కొని అధిక ధరలకు విక్రయిస్తున్నాడు. ఇతడి దందాపై పక్కా సమాచారమందుకున్న బాలానగర్ ఎస్ఓటీ, సనత్‌నగర్ పోలీసులు ఇతడి ఇంటిపై దాడి చేసి, అక్రమంగా నిల్వ ఉంచిన 400 కిలోల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.

రైల్వే స్టేషన్‌లో జారిపడి గాయాలతో వ్యక్తి మృతి


మృతి చెందిన అజయ్ కుమార్ పాండే

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు ఓ వ్యక్తి జారిపడి చికిత్స పొందుతూ మరణించిన సంఘటన సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో చోటుచేసుకుంది. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ పండరి తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్ బోజాపూర్ ప్రాంతానికి చెందిన అజయ్‌కుమార్ పాండే(44) కూలీ పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 11న సికింద్రాబాద్‌కు వచ్చేందుకు బీహార్‌లో దానాపూర్ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కాడు. శుక్రవారం మధ్యరాత్రి రైలు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు చేరుకుంది. రైలు దిగిన పాండే ప్లాట్‌ఫాంపై ప్రమాదవశాత్తు కాలు జారిపడడంతో తలకు తీవ్ర గాయమైంది. వెంటనే వైద్య పరీక్షల నిమిత్తం గాంధీ ఆస్పత్రిలో చేర్పించగా కొద్దిసేపటికే మరణించాడు. పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.